—యమ్.జయశ్రీ

# లవ్ ట్రా(ప్)క్

## సారీ... డాక్టర్!

డా.రాయ్ కారుదిగి హాస్పిటల్‌లో కొస్తుంటేనే నర్స్ ఎదురై—

"సార్... 14వ నెంబర్ రూమ్‌లోని పేషెంట్ బాగా గొడవ చేస్తోంది" అని చెప్పింది.



రాయ్ గబగబా అటు నడిచాడు. డోర్ చిన్నగా నాక్ చేసి లోపలికి అడుగుపెట్టాడు. అస్తవ్యస్తంగా పడుకొనివున్న ఆ పేషెంట్ గబుక్కున లేచి కూర్చొంది.

"గుడ్‌మార్నింగ్ డాక్టర్...!" నవ్వుతూ విష్‌చేసింది.

"మార్నింగ్ హౌ ఆర్‌యూ"

"ఆ విషయం మీరు చెప్పాలి... కాస్త నిష్టూరంగా అంటూ.

"డాక్టర్... మీరేమో... సుధా యు ఆర్ ఆల్‌రైట్ అంటారు. ఆ నర్స్ నన్నా కాలు కిందపెట్టనివ్వదు. చల్లగాలికి బయట తిరుగుతామని వెళ్తే నన్ను తిట్టింది." కంప్లయింట్ చేసింది.

"సుధా... నిన్ను ఫ్రీగా తిరగనివ్వ మని నేను చెబుతానులే... కానీ" డాక్టర్‌గారి మాట పూర్తవకముందే సుధ గబుక్కున బెడ్‌దిగి మునివేళ్ళమీద నిలబడి అతని నుదుట మీద ముద్దుపెట్టుకొని—

"థాంక్యూ డాక్టర్... థ్యాంకూ... ఎప్పుడీ జైలునుంచి విడుదల అవుతానా అని చూస్తున్నాను" అంది ఆనందంగా.

రాయ్ ఒక్క క్షణం ఆశ్చర్యంగా చూసి "వెరీ ఎగ్జయిటింగ్ గర్ల్‌యు ఆర్... కానీ ఒక షరతు"

"చెప్పండి డాక్టర్..." ఆత్రంగా అడిగింది.

"మరో నాలుగు రోజులుండాలి. ఆ తర్వాతే డిశ్చార్జ్ చేస్తాను. ఆ... ఇంతకీ మీ వాళ్ళెవరూ రాలేదా...?"

"లేదు డాక్టర్... నా పెల్రిగామ్స్ అందివుండదు" దిగులుగా చెప్పింది.

"డోంట్ వర్రీ... టేక్ రెస్ట్" అంటూ భుజం మీద తట్టి వెనక్కి తిరిగాడు.

సుధని పదిహేనురోజుల క్రితం ఎవరో హాస్పిటల్ చేర్చారు ఆ అమ్మాయికి అపెండిక్సు వెంటనే రాయ్ ఆపరేషన్ చేశాడు.

ప్రస్తుతం సుధ ఆరోగ్యంగా వున్నా రాయ్‌కి మనసొప్పటంలేదు ఆమెను పంపటానికి. కారణం...

సుధ అద్భుత సౌందర్యవతి.

* * *

రెండు రోజుల తర్వాత— డా. రాయ్ రాగానే నర్స్ వచ్చి "14వ నెంబర్ గదిలోని పేషెంట్ ప్రొద్దుట్నించీ కనపడటంలేదు ఆమె తాలూకు వస్తువులేవి లేవు" అని చెప్పింది.

"నాన్‌సెన్స్ ప్రొద్దుట్నుంచీ కనపడటంలేదా? మీరంతా ఏం చేస్తున్నారు" నర్స్ మీద ఎగిరాడు.

"మీరే కదా... ఆ అమ్మాయిని ఫ్రీగా వదిలేయండి ఏం రిస్ట్రిక్షన్స్ పెట్టొద్దని చెప్పారు... బిల్ రెండువేలదాకా అయింది" నర్స్ చిన్నగా గొణుగుతోంది.

అప్రయత్నంగా రాయ్ చేయి నుదుటిని సున్నితంగా నిమిరింది. *